www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231


తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టు గంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :12 | 21-12-2020 | పుటలు : 4




"పరులు నీ పట్ల ఎలా ఉండాలని అనుకుంటున్నావో నువ్వు పరుల పట్ల అలా ఉండు. శక్తివంచన లేకుండా మేలు చెయ్యి. పనికిమాలిన పనులతో జీవితాన్ని వృథా చేసుకోకు. అమృతభాండంలా కనిపిస్తూ విషాన్ని నింపుకున్న వారి పట్ల జాగ్రత్తను కలిగి ఉండు.ద్వేషాన్ని దిగమింగి కారుణ్యాన్ని ప్రదర్శించు. పరులపై బురద చల్లకు.అది నీమీదే పడే అవకాశం ఉంది."

కరుణామయుడు మానవ జాతికి ప్రవచించిన సత్ప్రవర్తనా సూత్రావళి ఇది.కాలం మారినా ఈ సూక్తులకు కాలం చెల్లదు. 'సెర్మన్ ఆన్ ది మౌంట్' శిఖరాగ్ర ప్రవచనం అందరికీ ఆచరణీయం. ఒక నక్షత్రం కరుణగా మూర్తీభవించి, దివి నుంచి భువికి దిగి వచ్చిన రోజు.ఈ క్రిస్మస్ శుభవేళ ఆయనను కీర్తిస్తూ, వారి మంచి మాటను పాటిస్తామని ప్రమాణం చేద్దాం!

**అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు!!**

- నన్నయ వాణి

### మేథమెటికల్ సైన్సెస్‌పై

# నేషనల్ వెబినార్



డిసెంబర్ 22న జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రిసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మేథమెటికల్ సైన్సెస్ అనే అంశంపై జాతీయ వెబినార్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు. దీనిపై వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జయంతిని పురస్కరించుకొని నేషనల్ వెబినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. దేశ విదేశాలలో గణితశాస్త్ర నిష్ణాతులుగా పేరు సంపాదించుకొని భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ కీర్తిని స్మరించుకొనే విధంగా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు ఈ నేషనల్ వెబినార్ లో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. దీనికి కన్వీనర్‌గా డా. కె. రేవతి వ్యవహరిస్తున్నారని, ఆచార్య కె. కేసశరెడ్డి జె. ఎన్. టి. యూ అనంతపూర్, డా. జి. నానాజీరావు ఆంధ్ర విశ్వవిద్యాలయం వక్తలుగా ఉపన్యసిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డా. కె. స్వామి, డా. కె. రేవతి, టి. శ్రీనివాసరావు, డా. వి. మల్లిప్రియ, కె. గీతాలక్ష్మీ, డా. ఎల్. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ




పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. వీసీ కార్యాలయంలో ఆయన ఫలితాలు విడుదల చేసి వివరాలను తెలియజేశారు. డిగ్రీ నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థుల పరీక్ష ఫలితాలను విడుదల చేశామని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని 25,854 మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాశారని వారిలో 15,630 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 60.40 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. కోవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన యూనివర్సిటీ ఎగ్జామినేషన్ విభాగాన్ని అధికారులను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్ లింగారెడ్డి, యూనివర్సిటీ లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



క్యాన్సర్ అవగాహన వెబినార్ లో మాట్లాడుతున్న వీసీ

క్యాన్సర్ పై అవగాహన మరింత పెరగాలని, విద్యావంతులు క్యాన్సర్ పై అవగాహన పెంచుతూ సమాజాన్ని చైతన్యవంతం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్. ఎస్. ఎస్ విభాగం మరియు సంజీవని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో "క్యాన్సర్ నివారణ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన" వెబినార్ ను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. క్యాన్సర్ వ్యాధితో అనేకమంది మరణిస్తున్నారని క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ కాన్సర్ వంటి విషయాలను బహిర్గతం చేయడానికి సిగ్గు పడతారని తద్వారా భవిష్యత్తులో ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించగలిగితే చికిత్స ద్వారా నిరోధించగలమని తెలిపారు. కాబట్టి విద్యావంతులు క్యాన్సర్ పై అవగాహన తో సమాజాన్ని చైతన్యవంతులను చేసి రక్షించాలని సూచించారు. అవగాహన పొందినవారు మరికొందరికి అవగాహన కల్పిస్తూ క్యాన్సర్ ను సమాజం నుండి దూరం చేసేందుకు ప్రయత్నించాలని తెలిపారు. సంజీవని వ్యవస్థాపకురాలు రూబీ ఆహుల్ వాలియ క్యాన్సర్ రకాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం క్విజ్ నిర్వహించి విజేతలను ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. బి. కెజియారాణి, ఎం. జశ్వంత్, ఉభయగోదావరి జిల్లాల ప్రోగ్రాం అధికారులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ-కంటెంట్‌తో విజ్ఞానాన్ని అందించాలి



గిరిజన ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విజ్ఞానాన్ని అందించేందుకు ఈ-కంటెంట్ విధానాన్ని అభివృద్ధి పరచాలని వీసీ ఆచార్య జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'ట్రైబల్ ప్రాంతాల నుండి విద్యార్థులకు వర్చువల్ టీచింగ్ యొక్క సవాళ్ళపై అంతర్జాతీయ ఇ-కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ ఆన్లైన్ సమావేశం బుధవారం ప్రారంభమైంది. వీసీ జగన్నాథరావు ప్రారంభోపన్యాసం చేశారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో నూతన విద్యా విధానాలు వెలుగులోనికి వచ్చాయని, సాంకేతిక విద్య ప్రగతి వైపు అడుగులు వేస్తున్నామని అన్నారు. భారతదేశంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో నేటికీ సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా అందుబాటులో లేదని కాబట్టి ఈ కంటెంట్ పాఠ్యాంశాలను అభివృద్ధి పరచాలని చెప్పారు. ఇంటర్నెట్ కమ్యూనికేషన్ పూర్తిగా అందుబాటులో లేని ప్రాంతాలకు రేడియో, టెలివిజన్ సాధనాల ద్వారా విజ్ఞానాన్ని ప్రసరింప చేయాలని తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం కోవిడ్ సమయంలో ఆన్లైన్ విజ్ఞానాన్ని విస్తృత పరిచిందని తెలియజేశారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టీవీ కట్టిమణి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు సాంకేతిక విద్యా విజ్ఞానాన్ని ఏ విధంగా అందించాలనే అంశాలపై చర్చించారు. దీనికి కన్వీనర్ గా డా. ఆర్. ఎస్ వరహాలదొర, కో కన్వీనర్ గా రాజమణి వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ట్రైబల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ హెచ్ లజపతిరాయ్, ప్రిన్సిపాల్ డా. కె సుబ్బారావు, పరిపాలన అధికారి డా. ఎన్. వి. ఎస్. సూర్యనారాయణ మరియు దేశ విదేశాల నుండి విద్యావంతులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేసారు.

### మంచిమాట

జ్ఞానము సంపాదించినవాడు,వివేచన కలిగిన నరుడు ధన్యుడు!!

- బైబిల్



## సంపాదకీయం

# హృదయశుద్ధి



ప్రభవ మొందినాడు పశువుల పాకలో
తొట్టెలోన తేనె పట్టువోలె !
కాంతి బిందువొకటి
కబురుచెప్పినదంట
రాకబోలు వాని రాకగూర్చి !!

అవతార పురుషులు జన్మించినప్పుడు ప్రకృతి, మానవాళి, దేవతలు ఆనందంతో పులకిస్తారు. స్వాగతం పలుకుతారు. 'ప్రజలందరికీ కలుగబోవు మహా సంతోషకరమైన సువార్తను నేను మీకు తెలియచేస్తున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడ'ని దేవదూత పలికేసరికి గొర్రెల కాపరులు, జ్ఞానులు ఆశ్చర్యచకితులయ్యారు.

ప్రభవించిన రక్షకుడు తన జీవన విధానంతో, బోధనలతో, ఈ లోకంలో ఒక అలజడి రేపాడు. ఆయన ఉద్బోధించిన సిద్ధాంతాలు మనిషిని దేవుని దగ్గరకు చేర్చాయి. వారిద్దరినీ ప్రేమ బంధంతో ముడివేశాయి. ధర్మబద్ధమైన జీవన పరిపక్వానికి ఇదే అవసరం. ఆధ్యాత్మికం కొరకు తహతహలాడే ఆకలిగొన్న ఆత్మను శాంతపరిచే మార్గమిదే. ఇదే ఏ మతానికైనా ముఖ్యావసరమైంది. ఇది మానవునిలోని మహనీయతను చాటి చెప్పి అతని ఐహిక,సాంఘిక స్థానాన్ని మారుస్తుంది. సృష్టిలో సర్వమానవ ప్రేమను పెంచుతుంది. ఈ ఆధ్యాత్మిక వాస్తవాన్ని గ్రహించి, జీవితంలో, నడవడిలో సర్వమానవ ప్రేమను వశం చేసుకోవటమే మతం. ఈ విధానంలోనే క్రీస్తు ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవితానికి ఒక కొత్త దనాన్ని ఇవ్వదలిచారు. ఆత్మవిషయమై దీనులైన వారు ధన్యులని, పరలోక రాజ్యము వారిదని ఒక కొత్త సూత్రాన్ని చెప్పారు. పరలోక రాజ్యం మనలోనే ఉందని దానిని మనం తెలుసుకోవచ్చునని జీవికి మార్గాన్ని చూపారు. ఇది ఒక ఆధ్యాత్మిక విప్లవం. దైవానికి చెందిన ఒక అనుభూతిని ఇక్కడే అనుకున్నప్పుడు పొందవచ్చునని క్రొత్త నిబంధనను సూచించారు.


హృదయశుద్ధి గలవారు ధన్యులని, వారు దేవుని చూచెదరని ఆధ్యాత్మిక సత్యాన్ని ప్రవచించారు. ఆ అనుభూతికి నిర్మల హృదయం అవసరం. దయ, నీతి, యధార్ధత, సంఘసేవ వలననే పవిత్రత లభిస్తుందనే జీసస్ బోధనలు వలన భగవంతుని దర్శించవచ్చునని, ఈ జీవిత కాలంలోనే ఆశీర్వాదాన్ని పొందవచ్చునని అందరూ తెలుసుకున్నారు.

క్రీస్తు ప్రత్యేక సువార్త - దైవ సాక్షాత్కారం! అందుకే ఆయన ఒక క్రొత్త ఆజ్ఞ ఇచ్చారు." నేను మిమ్మల్ని ప్రేమించునట్లుగానే మీరును ఒకరిపట్ల ఒకరు ప్రేమను కలిగి ఉండవలెను"

ఇదే కరుణామయుని ప్రేమ సందేశం !
కల్లోలిత సమాజానికి శాంతి సందేశం !!

# రస్కిన్ కథలు పుస్తకం






రస్కిన్ పుట్టుకతో ఆంగ్లేయుడే అయినా పెరిగింది మాత్రం భారతీయుడిగా. ఆ మాటకొస్తే ఆయన భారతీయుడిగా పుట్ట లేదు. పుట్టుక ఏదైనా రేషన్ కార్డు, ఓటు హక్కు ఉన్నాయి. భారతీయ పౌరసత్వానికి నిదర్శనాలుగా చాలా మంది వీటినే పేర్కొంటారు. నిజానికి వీటన్నిటికీ మించి భారతీయ ఆంగ్ల సాహితీవేత్తగా రస్కిన్ బాండ్‌కి అనన్య సామాన్యమైన పేరుంది. పాఠ్యపుస్తకాల్లో ఆయన సృష్టించిన సాహిత్యం ఎన్నో ఏళ్ళుగా ఒక అంశంగా ఉంది. రస్కిన్ చాలా విలక్షణమైన కథలు రాశారు. ఆయన రచనలు చదవడం ఒక అనుభవం. జీవితానుభవాల నుంచి జీవన సంఘర్షణల నుండి నేరుగా నడచి వచ్చిన రచయితలు సృష్టించే సాహిత్యంలో కల్పనలు ఉండవు. ఇటువంటి రచయితలు చిత్రించే కథల్లో జీవితంలోని ఆకర్షణలు, భ్రమలు, కల్పనలు ఉండవు. జీవితం పట్ల లేనిపోని భ్రమలు కల్పించరు. అటువంటి వారి రచనలు చదివినప్పుడు జీవితానికి ఉండే వైవిధ్య కోణాలు తెలుస్తాయి. ఆ రచనలు సజీవమై జీవితానుభవంలోనికి వస్తాయి. తద్వారా జీవితానికి ఉన్న విస్తృతి, విశాలత్వమూ పాఠకుని అనుభవంలోనికి వస్తాయి. గొప్ప రచయితలు అందరూ చాలా సాధారణ రచనలు చేస్తారు. రస్కిన్ కథలు మానవ ప్రవృత్తిని అనేక కోణాల నుంచి దర్శిస్తాయి. ప్రకృతికి మానవ ప్రవృత్తికి అనుబంధం ఆయన కథల్లో తొంగిచూస్తోంది. ఆయన రచనల్లో ప్రధానపాత్ర ఇదే. దర్శించిన అనుభవాన్ని అదేవిధంగా రాస్తాడు. పర్వతాలను, లోయలను, వృక్షాలను, పక్షులను, పుష్పాలను, జంతువుల్ని ఎప్పుడూ గొప్పగానే వాటి వాటి ప్రత్యేకతలతో చిత్రిస్తాడు. ఆయన పాత్రలు జీవితాన్ని వెతుకులాడుతాయి. ఆ అన్వేషణ అనుభవాన్ని పాఠకుడి మనఃఫలకం మీద గాఢంగా ముద్రస్తాయి. అధికారము, డబ్బు, అంతస్థు, మనిషి జీవితానుభూతుల మీద పడకుండా ఉంటే పాఠకుని కలలు, సంవేదనలు, ఉద్వేగాలు రస్కిన్ కథల్లోంచి నేరుగా పాఠకుని మనస్సులోనికి ప్రవహిస్తాయి. సముద్ర కెరటాల్లా ఎగిసిపడి కన్నీటి చినుకుల్లా రాల్తుంటాయి.




- సీతారాం

# కోవిడ్ వ్యాప్తిని అరికడదాం...

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

స్వీయ నియంత్రణతో కోవిడ్ 19 వ్యాప్తిని అరికడదామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, కృష్ణా యూనివర్సిటీ, సంబంద్ హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించారు. 'ఇంపాక్ట్ అఫ్ స్పిట్టింగ్ ఆన్ కోవిడ్ 19' అనే అంశంపై జరిగిన ఈ వెబినార్‌లో వీసీ ఉపన్యసించారు. కోవిడ్ 19ను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రపంచంలోని ప్రజ లందరూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఉమ్ము వేయడం, ఎటువంటి జాగ్రత్తలూ తీసుకోకపోవడం వలన అనేక అనారోగ్యాలకు కారణమవుతున్నాయని చెప్పారు. వైరస్‌లను వ్యాప్తి చేయడంలో మన అజాగ్రత్తలే ప్రధాన మార్గాలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.కెజియారాణి, కృష్ణా యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.బి.చంద్రశేఖర్, డాక్టర్ వి.మురళి కృష్ణ, డా.జె. లావణ్య లతా, సంజయ్ సెత్ ఉభయగోదావరి జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.




వెబినార్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రుల హృదయాలలో చిరస్మరణీయులుగా ఉంటారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్లో మంగళవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19న నుండి డిసెంబర్ 15 వ తేదీ అర్ధరాత్రి వరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులైన మహనీయులని కొనియాడారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని లక్ష్యసాధన కోసం ఆయన చేసిన ప్రాణ త్యాగం మరువ లేనిదని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడుగా పొట్టి శ్రీరాములు కీర్తి గావించారని అన్నారు. గాంధీజీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ కొరకు పొట్టి శ్రీరాములు జీవితాంతం కృషి చేసారని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డా.ఎం. గోపాలకృష్ణ, యూనివర్సిటీ లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాముల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ




### ప్రతిభా వాణి

## ముట్నూరి కృష్ణారావు

(1879-1945)



సంపాదకులుగా నాలుగున్నర దశాబ్దాలకు పైగా "కృష్ణాపత్రిక" కోసం అహర్నిశలు త్రికరణశుద్ధిగా కృషిచేసి, ఆంధ్రభాషలో ఒరవడి దిద్దిన శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు సంపాదకులకి సంపాదకులుగా వినుతికెక్కారు. సాహిత్య, సామాజిక, రాజకీయ విశ్లేషణ వలన కృష్ణా పత్రిక కార్యాలయంలో దర్బారును నిర్వహించడం వలన రాజకీయ, సామాజిక ఉద్యమ సారధిగా పిలువబడ్డారు. బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం గారి శిష్యరికంలో బ్రహ్మ సమాజికునిగా సంఘ సంస్కరణోద్యమాలను, సంస్కరణలను తెచ్చారు. వారి మిత్రులు భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు, కోపల్లె హనుమంతరావు గార్లతో కలసి 'బందరుత్రయం' గా పిలువబడ్డారు. కృష్ణారావు గారు అంతర్ముఖులు. తనను గూర్చి చెప్పుకోవటానికి కూడా ఏనాడూ అంగీకరించలేదు. పత్రికలో ఏమిరాసినా చిత్తశుద్ధితో, ఆచరణ సాధ్యమైన అంశాలనే ప్రస్తావించేవారు. కృష్ణా పత్రికను కానీ,ప్రింటింగ్ ప్రెస్ ను కానీ లాభాపేక్షతో నిర్వహించలేదు. కృష్ణారావు గారు ఎంత గాంభీరులో అంత విశాల హృదయులు. హాస్య ప్రియులు. కృష్ణారావు గారు వేదాంతంలో వెలుగులను చూసినవారు. జీవితంలో సుఖ దుఃఖాలను అనుభవించిన వారు. తాను ఉపదేశాలను ఇవ్వటం కాదు, ఆచరణలో చూపిన వారు. సంస్కరణవాదులు. ఆయన ప్రతి వచనం ఒక నిర్వచనం. ప్రతి వాక్యం గద్య కావ్యం. కవికి,ఋషికి కావలసిన క్రాంత దర్శకత్వాన్ని పత్రికా సంపాదకునిగా ఆయన సాధించారు. ఆంధ్రదేశానికి ప్రత్యేకతను సంతరింప చెయ్యటమే కాకుండా,జాతీయ పునరుజ్జీవనానికి పునాదులు వేశారు.

'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కథాచన'(చేసే కర్మ నీవు చేయి , ఫలితాన్ని ఆశించకు)అనే భారతీయ తత్వాన్ని రంగరించి జాతికి అందించారు. సమాజ చింతనను అక్షర రూపంలో,మాటల బాణాలతో విదేశీ పాలకులను,పాలనను చీల్చిచెండాటంలో అభిమన్యుని వంటి వీర యోధునిలా భాసించారు. బహుముఖాలుగా విస్తరించిన ఆయన ప్రజ్ఞాపాటవాలు ఉపన్యాసాలతో పాటు అక్షరరూపంలో ఆంధ్ర జాతిని కృష్ణా పత్రిక రూపంలో నాలుగు దశాబ్దాల పాటు ప్రభావితం చేశాయి. కొండంత దేవునికి పత్రి పూజ అన్నట్లుగా వారి ప్రతిభకు, సేవలకిదే 'నన్నయ వాణి' అక్షర నీరాజనం !!

# ప్రతిభకు అడ్డురాని పేదరికం



### స్ఫూర్తి

చిన్నప్పటినుండి చదువంటే ఆసక్తి కానీ తల్లిదండ్రుల నిరక్షరాస్యత, సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లేకపోవడం, దానికి పేదరికం తోడవడంతో భవిష్యత్ ప్రణాళిక లేకుండానే నేను డిగ్రీ పూర్తి చేశాను. తరువాత మిత్రుడు సురేష్ సూచన మేరకు బీఈడీ రెండేళ్ల చేస్తారనే ఆందోళనతో ఇద్దరం కూడా ప్రవేశ పరీక్ష రాసి నన్నయ యూనివర్సిటీలో చేరాం. ఇది నా జీవితానికి పునాది రాయిగా భావిస్తున్నాను. ఆహ్లాదకరమైన వాతావరణంలో గోదారమ్మ ఒడిలో విద్యా కళాశాల ఆచార్యులు అందించే ప్రోత్సాహం సామాజిక చైతన్యం నాకు బాగా ఒంటపట్టాయి. చదువు మనకు మన కుటుంబంతో పాటు సమాజానికి కూడా ఉపయోగపడాలన్న ఆచార్యులు డా. ఆర్. ఎస్ వరహాలదొర గారి మాటలు ఇప్పటికీ నా చెవిలో వినిపిస్తూనే ఉంటాయి. ప్రకృతిపై మక్కువతో ఆచార్య దొర, తెలుగు ఆచార్యులు వాసు గారి ప్రోత్సాహంతో 'ప్రకృతి-ప్రేమ'అనే పుస్తకం రాయడం, తద్వారా వచన, గేయ, పద్య కవిత్వంపై అవగాహన రావడానికి దోహదపడింది. MSc వృక్షశాస్త్రంలో ప్రవేశించటంతో విశ్వవిద్యాలయం నన్ను మరింత ప్రకృతి ప్రేమికుడ్ని చేసింది. డా.పద్మావతి, డా.సులక్షణ, డా.శామ్యూల్, డా.ప్రజ్ఞ, డా. ముత్యాలనాయుడు ఆచార్యులంతా ఎంతో చక్కగా పాఠాలు అర్థమయ్యే విధంగా విడమర్చి చెప్పడం వల్ల నేను తెలుగు మాధ్యమం నుండి వచ్చిన విద్యార్థిని అనే విషయాన్ని మర్చిపోయాను. నా శ్రమ, అధ్యాపకులు ఇచ్చే ప్రోద్భలమే MSc వృక్షశాస్త్రములో నాకు ప్రతిభా అవార్డు తెచ్చిపెట్టాయి. ప్రత్యేకంగా డాక్టర్ పద్మావతి మేడం విద్యార్థుల భవిష్యత్తుపై తీసుకున్న కార్యాచరణలో భాగంగా "నేచురల్ ఫ్రెండ్లీ ప్రాక్టీసెస్" అనే వర్క్షాప్ విశ్వవిద్యాలయంలో 23 మంది వృక్షశాస్త్ర విద్యార్థుల జీవితాన్ని మార్చి రైతు సేవాపథంలో నిలబడేటట్లు చేసింది. ఇది విశ్వవిద్యాలయం గర్వించ దగ్గ విషయం. విశ్వవిద్యాలయంలో ఉంటూనే ప్రకృతి వ్యవసాయ పాఠాన్ని నేర్పించి క్షేత్ర పర్యటనలు చేసి ప్రకృతి వ్యవసాయం పైన అకడమిక్ ప్రాజెక్టును కూడా చేయడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ విజయ కుమార్ IAS గారి దృష్టికి తీసుకువెళ్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ శాఖలోనికి నేచురల్ ఫార్మింగ్ ఫెలోగా తీసుకోవడం జరిగింది. గడిచిన రెండున్నర సంవత్సరాలుగా విశాఖపట్నం జిల్లా హుకుంపేట మండలంలోని వ్యవసాయశాఖ ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేసే నేను గడిచిన నాలుగు నెలలు నుండి ఉద్యోగోన్నతి పొంది విజయనగరం జిల్లా స్థాయి ట్రైనింగ్ అసోసియేట్ గా పనిచేయటం ఎంతగానో ఆనందదాయకంగా ఉంది. రీడింగ్ యూనివర్సిటీ (లండన్), వెస్ట్రన్ యూనివర్సిటీ (ఆస్ట్రేలియా) వంటి విశ్వవిద్యాలయాలతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై పరిశోధనలు చేయగల్గుతున్నానంటే నన్నయ విశ్వవిద్యాలయం ఇచ్చే శాస్త్ర సాంకేతిక తోడ్పాటేనని తెలియజేస్తున్నాను. నాకు జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రుల తరువాత నేను ఎవరికైనా రుణపడి ఉన్నానంటే అది విశ్వవిద్యాలయానికి ఋణపడి ఉన్నాను. విశ్వవిద్యాలయంలోని సహాయ సహకారాలు అందించిన అన్ని విభాగాల ఆచార్యులకు మరియు సిబ్బందికి కృతజ్ఞతలు.

**- కొల్లి సనత్ కుమార్, ట్రైనింగ్ అసోసియేట్**
**ప్రకృతి వ్యవసాయ విభాగం- విజయనగరం**

## జిల్లా థాయ్ బాక్సింగ్ పోటీల్లో తులసికి స్వర్ణ పతకం



తూర్పుగోదావరి జిల్లా థాయ్ బాక్సింగ్ పోటీల్లో విశ్వ విద్యాలయ రాజనీతి శాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థిని ఎం.తులసి స్వర్ణ పతకాన్ని సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీసీ ఆచార్య జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య గంగారావు, విభాగాధిపతి డాక్టర్ ఎన్.రాజశేఖర్, ఆచార్యులు డా. బాలకృష్ణ, డా. యామినీ జ్యోత్స్న, శ్రీ జె.సూరయ్య తులసిని అభినందించారు.

# నన్నయలో సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్


మల్లేశ్వరరావు సన్మానిస్తున్న వీసీ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్కును ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సాంకేతిక నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలో సాఫ్ట్‌వేర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కొంత కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ ఎ.వి. మల్లేశ్వరరావు విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. విశ్వ విద్యాలయంలోని వనరులను, వసతులను ఆయన పరిశీలించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఈసీ హాల్‌లో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఆచార్య మొక్క జగన్నాథరావు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలకు విద్యా కేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్‌ను ఏర్పాటు చేయడానికి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ఠ ఆఫ్ ఇండియా వారు పూర్తి సహకారాన్ని అందించాలని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఒక శిక్షణా కేంద్రాన్ని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి గోదావరి జిల్లాల విద్యార్థులకు సాంకేతిక అభివృద్ధిలో మెరుగైన శిక్షణను అందించాలని తెలిపారు. తద్వారా పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలలో నన్నయ విద్యార్థులు ఉన్నత శ్రేణి ఉద్యోగాలను అధిరోహించగలరని అన్నారు. భారత దేశంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆధ్వర్యంలో 60 కేంద్రాలు ఉన్నాయని దానిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తోడ్పాటును అందించాలని అన్నారు. సాఫ్ట్‌వేటెక్నాలజీ పార్క్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మధ్య త్వరలో అవగాహన ఒప్పందం చేసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఏ.వీ.మల్లేశ్వరరావును వీసీ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ కె.రమణేశ్వరి, ఆచార్య వై శ్రీనివాసరావు, డాక్టర్ డి.జ్యోతిర్మయి, డాక్టర్ కె.నూకరత్నం, డాక్టర్ కె.వి.స్వామి, డాక్టర్ కె.దీప్తి, డాక్టర్ ఎన్.ఉదయభాస్కర్, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఏలూరు ఘటనపై అధ్యయనం చేయండి

## అధ్యయన కమిటీకి వీసీ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఏలూరులో అంతుచిక్కని వ్యాధితో అస్వస్థకు గురైన ఘటనపై అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వ విద్యాలయంలో బుధవారం అన్ని విభాగాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. దీనిలో వీసీ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు ప్రాంతంలో అనారోగ్య సమస్యపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని తెలిపారు. విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతగా ఏలూరులోని అనారోగ్య సమస్య పై అధ్యయనం చేస్తూ మరో వైపు ప్రజలకు భరోసా కల్పించాలని చెప్పారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహకారంతో సేవలు అందించాలన్నారు. యూనివర్శిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు డా.ఎ.మట్టారెడ్డి అధ్వర్యంలో ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ఈసీ మెంబర్లు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం

'ఒక కన్నీటి బిందువును వేయి చేతులు తుడవగలగాలి' అంటారు ఒక రచయిత.

'ప్రార్థించే పెదవుల కన్నా సేవలు చేసే చేతులుమిన్న' అంటారో సంఘసేవిక.

'సొంత లాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడవోయ్' ఇదొక కవి ప్రబోధం.

విద్యార్థి దశలో సమాజ సేవ పట్ల అవగాహన కలిగించే ఉదాహరణలు ఇవి. సంఘ సేవకు కావలసింది పదవులు కాదు, సేవాతత్పరత! విద్యార్థులు చేయలేనిది, సాధించలేనిది ఏముంటుంది.... ఉత్సాహం,బలం, ఆసక్తిగల విద్యార్థులే సంఘ సేవా పరాయణులుగా ఉంటారు.

ఆత్మ సంతృప్తిని,ఆత్మ విశ్వాసాన్ని విద్యార్థి దశలో పెంపొందింపజేసే కార్యక్రమమే 'జాతీయ సేవా పథకం' NSS (National Service Scheme) ప్రతికళాశాలలో, విశ్వ విద్యాలయాలలో NSS విద్యార్థులు స్వచ్ఛందంగా చేరి సమాజ సేవ చేస్తున్నారు. దేశభక్తిని ప్రకటించుకునే సువర్ణావకాశమే సమాజసేవ! ఇతరులకు మనం తోడ్పడితే ఇతరులు మనకు తోడ్పడతారు. అదే 'సంఘీభావం' అంటే! విద్యార్థుల్లో కార్యదీక్షా దక్షతను అలవర్చి, సత్పౌరులుగా తీర్చిదిద్దే సమాజసేవా కార్యక్రమాలే 'జాతీయ సేవా పథకం'లక్ష్యాలు,లక్షణాలు!!











డాక్టర్ బి. కెజియారాణి
కో ఆర్డినేటర్ (ఎన్ఎస్ఎస్), జాతీయ సేవాపథకం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

ఉభయ గోదావరి జిల్లాల కళాశాలల్లో 290 ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఉన్నాయి. 29 వేల మంది విద్యార్థులు ఈ సేవా పథకంలో విద్యార్థి కార్యకర్తలుగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సహకారంతో అనేక కార్యక్రమాలను చేయ డానికి వీలు కుదురుతుంది. 290 మంది ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సహ కారాన్ని అందిస్తు న్నారు. స్పెషల్ క్యాంపు ద్వారా ప్రతి సంవత్సరం అనేక గ్రామాలను దత్తత తీసుకుని వారం రోజులు విద్యార్థులు ఆయా గ్రామాలలోనే ఉండి అక్కడ సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. విశ్వవిద్యాలయం చుట్టుపక్కల గ్రామాలన్నిటిలోనూ సేవా కార్యక్రమాలను చేపట్టాం. అలాగే ప్రతి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ గ్రామాలలో సేవలు అందిస్తున్నాయి. కోవిడ్ సమయంలో పునరావాస కేంద్రాల్లో సేవలు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సహకారాలను అందించడం జరిగింది.

ఉభయగోదావరి జిల్లాల్లోని పారిశుద్ధ్య కార్మికులందరికీ కాయగూరలు, పండ్లు, నిత్యావసర వస్తువులు అందించారు. మానసిక వికలాంగులకు ,వృద్ధాశ్రమాలకు సేవలందిస్తున్నారు.

వరదల సమయంలో ప్రతి ఏడాది గోదావరి పరీవాహక ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. రైతులకు సహకరిస్తున్నారు. విశ్వవిద్యాల యంలో నాలుగవ తరగతి ఉద్యోగులకు నిత్యావసర వస్తువులు అందించాం. బోధనేతర సిబ్బందికి శానిటైజర్స్, మాస్కులు వితరణ చేయడం జరిగింది.

ఎన్ఎస్ఎస్ తరఫున అంతర్జాతీయంగా 8 వెబినార్స్, ఒక ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించాం. స్వచ్ఛభారత్ యాక్షన్ ప్లాన్‌లో సేవలు అందించడం జరిగింది. ట్రాన్స్ జెండర్స్‌కి సహకారం అందించడం, వారి సమస్యలను పరిష్కరించే కార్యక్రమాలను చేపట్టే పనిలో ఉన్నాం.

గ్రామీణ వాతావరణంలోని ప్రాంతాలను దత్తత తీసుకొని సహకారం అందిస్తున్నాం.

గత ఫిబ్రవరిలో యువ జనోత్సవాలు జరిగాయి. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు మెరుగుపరిచే ఉపన్యాసాలు, శిక్షణా కార్యక్రమాల్ని చేపట్టడం జరిగింది.

గత రిపబ్లిక్‌డే పెరేడ్ కి ఇద్దరు ఎంపికయ్యారు. రాబోయే ప్రి రిపబ్లిక్‌డే పెరేడ్‌కి సంబంధించి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. **"వి.సి.గారి ఆలోచన, సహకారంతో బ్లడ్ డోనార్స్ హబ్ పేరుతో వెబ్‌సైట్, మొబైల్ యాప్ అందుబాటులోకి రానుంది."** ఎప్పుడైనా, ఎక్కడైనా అత్యవసరమైతే వీటిద్వారా బ్లడ్ గ్రూప్,దాత, మొబైల్ నెంబర్ ను సంప్రతించవచ్చు. త్వరలోనే ఇది అందుబాటులోకి రానుంది.

వివిధ సేవా కార్యక్రమాలతో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథ రావు గారు, రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు గారి సహకారంతో ఈ జాతీయ సేవా పథకం ద్వారా అనేక సేవా కార్యక్రమాలకు రూపకల్పనలు, ప్రణాళికలతో ముందుకు వెళు తున్నాం. గోదావరి జిల్లా కళాశాలలు మంచి సహకారాన్ని అందిస్తున్నాయి.













